చవితికి గణపతులు సిద్ధం

- విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు
- మార్కెట్లో కొనుగోళ్ల సందడి



విక్రయానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు



తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

ఆదిలాబాద్: జిల్లాలో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. లంబోధరుడిని ప్రతిష్ఠించేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భక్తులకు అనుగుణంగా మార్కెట్లో విభిన్నమైన రూపాల్లో గణనాథుని ప్రతిమలను అందుబాటులో ఉంచారు. రెడీమేడ్ విగ్రహాలనే కాకుండా చేతితో తయారుచేసిన విగ్రహాలు, మట్టి విగ్రహాలను పూజించేందుకు ఆసక్తిని చూపుతున్నారు. కొందరు ప్రత్యేకంగా విగ్రహాలను తయారీ చేయిస్తున్నారు. వినాయక చవితికి కేవలం ఒక్కరోజే ఉండడంతో కళాకారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

రూ. 2వేల నుంచి రూ. 50 వేల దాకా..

వివిధ రూపాలు, సైజుల్లో వినాయక ప్రతిమలు మార్కెట్లో లభిస్తున్నాయి. ఇంట్లో పూజించడానికి చిన్న గణేశులు రూ. 300 నుంచి రూ. 1000 వరకూ ధర పలుకుతున్నాయి. మండపాల్లో కొలువుదీర్చే భారీ గణనాథులకు రూ. 2000 నుంచి రూ. 50,000 వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. అంతేకాకుండా మండపాల తయారీకి సామగ్రిని నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

రిమ్స్‌లో మౌలిక వసతులు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు మెరుగైన వైద్యం అందేలా రిమ్స్ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రూ. 11.35కోట్ల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఎంఆర్ఐ సేవలు అందుబాటులో లేని కారణంగా యాక్సిడెంట్ కేసులు ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో జర్మనీ నుంచి స్కానింగ్ యంత్రం రిమ్స్‌కు రానుందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కేంద్రం రూ. 120 కోట్లు ఇస్తే, దాని నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.50 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, రేడియాలజిస్టు కల్యాణ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కలకు ప్రభుత్వం కృషి

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాలను ప్రవేశపెట్టి సొంత ఇంటి కలను నిజం చేసేలా కృషి చేస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక చౌక్‌లో వంట ఆచారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్సూరెన్స్ పత్రాలు, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ జహీర్ రంజాని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, కన్నాల దేవన్న, ఇర్ఫాన్ ఖాన్, గంగన్న, ఫెరోజ్, పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధికి కృషి చేయాలి

కైలాస్‌నగర్: హిందీ భాషాభివృద్ధికి విద్యా మార్తాండ్ అవార్డు గ్రహీత దివంగత ప్రకాష్ గౌడ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం హిందీ భాషా సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాష్ గౌడ్, శివరాం ఖత్రీ చిత్రపటాలకు నివాళులర్పించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సుకుమార్ పెట్కులే, మధుబావల్కర్, రవి జబాడే, సాంబన్న, దత్తాత్రేయ, భాస్కర్, మహేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

నార్నూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకొని విధులకు హాజరవుతున్న కార్యాలయ సిబ్బందిని అడ్డుకున్నారు. సంఘం రాష్ట్ర నాయకురాలు జాదవ్ సుభద్ర, జిల్లా నాయకురాలు పంచశీలలు మాట్లాడుతూ.. ఇన్ని రోజులు ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలకు తగిన బుద్ధిచెప్పాలన్నారు. నాయకులు మల్లు, పుంచపూల, సంగీత, చంద్రకళ, కళ, రాధా, సుమిత్ర పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం ముట్టడి

బోథ్: బోథ్ ఐసీడీఎస్ కార్యాలయాన్ని శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశన్న, కిరణ్, సునీత, గంగయ్య, చంద్రకళ, రక్మిణి, ఆనంద, తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి



కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి మట్టి గణపతి విగ్రహాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్: వినాయక చవితి పురస్కరించుకొని ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, ఉమ్మడి జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి పుప్పాల శ్రీనివాస్‌కు శనివారం మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ, గణేశ్ చతుర్థి సందర్భంగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి మహాదేవ్, ఉపాధ్యక్షుడు రవీందర్, పరమేశ్వర్, లచ్చు, సుభాష్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆదిలాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి అభ్యర్థులకు శనివారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ నియంత్రణ బోర్డు ద్వారా జిల్లాకు మంజూరైన 2,500 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు, కౌన్సిలర్లు సతీష్, అశోక్ స్వామి, తదితరులున్నారు.

మట్టి గణపతుల పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల, కళాశాల ఆధ్వర్యంలో శనివారం మట్టి గణపతులు పంపిణీ చేశారు. విద్యార్థులు తయారుచేసిన గణనాథులను జిల్లా పరిషత్ పాఠశాల, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ నికిసీ వర్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్: మట్టి గణపతులనే పూజించాలని ఉమ్రీ పరిధిలోని చిత్తగూడ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అన్నారు. శనివారం మట్టి గణపతుల తయారీపై అవగాహన కల్పించారు. మట్టి వినాయక విగ్రహాల వలన కలిగే ప్రయోజనాలను వివరించడం జరిగిందన్నారు.

సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలి

ఆదిలాబాద్‌టౌన్: సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. శనివారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం నుంచి రిమ్స్ గైనకాలజిస్టులు, స్టాఫ్‌నర్సులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆసుపత్రిలో సీజేరియన్ కాన్పులు నియంత్రించేలా ప్రత్యేక దృష్టి సారించాలని గైనిక్ విభాగం హెచ్‌వోడీ పద్మినికి సూచించారు. ప్రసవాల వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.

ట్రాన్స్‌జెండర్లతో అడిషనల్ కలెక్టర్ సమావేశం

కైలాస్‌నగర్: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లతో జిల్లా అడిషనల్ కలెక్టర్ కుష్బూ గుప్తా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఓటరు సవరణలో భాగంగా ట్రాన్స్‌జెండర్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమాధికారిణి మిల్కా, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్డీఎఫ్ నిధుల్లో అవినీతి'

ఆదిలాబాద్: 2017– 18లో జిల్లాకు విడుదలైన ఎస్డీఎఫ్ నిధుల్లో అవినీతి జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రూ. 210 కోట్లలో రూ. 50 కోట్ల నిధులు గోల్‌మాల్ అయ్యాయని అన్నారు. రహదారుల నిర్మాణంలో సరైన వివరాలు పొందుపరచకుండా నిధులను దారి మళ్లించారని మండిపడ్డారు. పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు మంజూరైతే ఎమ్మెల్యే వారి అనుచరులకు లబ్ధి చేకూరేలా నిధులు కేటాయించారని విమర్శించారు. అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో లోక ప్రవీణ్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, దినేశ్, మాయూర్ చంద్ర, అస్తక్ సుభాష్, వేదవ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



ప్రవచనలు బోధిస్తున్న నారాయణ్ మహరాజ్

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని నారాయణ్ మహరాజ్ అన్నారు. శనివారం మండలంలోని అందునాయక్‌తండాలో జ్వాలముఖి, దుర్గామాత ఆలయంలో ఆలయ మహరాజ్ రాంసింగ్‌బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన విరట్ హిందూ ధర్మ సమ్మేళనానికి హాజరయ్యారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు, హనుమాన్ చాలీసా పారాయణం బోధించారు. ముందుగా మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే రేఖానాయక్ జ్వాలముఖి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కోరెంగా యేశ్వంత్‌రావ్. విష్ణు మహరాజ్, భీంరావ్ మహరాజ్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: ఆధ్యాత్మికంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజేశ్ స్వామి అన్నారు. శనివారం మండలంలోని ఎంపల్లి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, కలిసి ఉండాలని సూచించారు. హిందూ ధర్మానికి సంబంధించిన సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరం వారికి అందించాలన్నారు. కార్యక్రమంలో కై లాస్‌నాయక్, హరిచంద్, బాబులాల్, శేషరావు, రామారావు, పింటు, భిక్కు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఆలయాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వెల్లువిరుస్తుందని బీజేపీ గిరిజనమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. శనివారం తేజాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి, బుర్కపెల్లి హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో హీరాసింగ్, సాబ్లే సంతోష్ సింగ్, ఆమ్టే మాధవ్, తొడసం శంకర్, గంధం నవీన్, సంజీవ్, ధర్మపురి రాఘవులు, బాక్రే లక్ష్మణ్ పాల్గొన్నారు.

తలమడుగు: భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్‌లో శబరిమాత ఆశ్రమంలో 45 రోజుల పాటు నిర్వహించిన అఖండ జ్యోతి ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్దుల్లా, మొట్టె కిరణ్, జీవన్ రెడ్డి, ఆశన్న, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: మత్స్యకారుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండలంలోని వడ్డాడి వద్ద మత్తడివాగు ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. ప్రాజెక్టులో 5.84 లక్షల చేప పిల్లలు, 2.92 లక్షల రొయ్య పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని కులాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. మత్స్యకారులకు ఇప్పటికే రాయితీపై వాహనాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ సాంబశివరావు, సర్పంచ్‌లు సదానంద్, కృష్ణ, శ్రీనివాస్, బోథ్ అధికార ప్రతినిధి కిరణ్, గోవర్ధన్, శ్రీధర్ రెడ్డి, అరుణ్, నరేందర్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



నిల్వ నీటిని పారబోస్తున్న డీపీవో శ్రీనివాస్

గుడిహత్నూర్: పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించిన ఆయన పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ.. చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పాత డబ్బాలు, కుండీలు, డ్రమ్ములు, టైర్లలో వర్షపు నీరు నిల్వ ఉంచవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ సునీతారమేశ్ జాదవ్, ఉప సర్పంచ్ మటపతి గజానంద్, పంచాయతీ సెక్రటరీ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీ బురదలో వేసి నిరసన

బేల: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మశాల(బి) గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీని బురదలో వేసి నిరసన తెలిపారు. ఎస్సై రాధిక, జీవన్‌లు అడ్డుకుని ఫ్లెక్సీని లాక్కున్నారు. నాయకులను అరెస్టు చేసి, సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తర్నం బ్రిడ్జి కూలిపోయి మండలవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, మశాల (బి) గ్రామానికి వెళ్లే రోడ్డు కూడా గుంతలమయంగా మారిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, వాంఖడే వామన్, గావుండే ఘణేశ్యాం, అఖిల్, మడావి చంద్రకాంత్, రూప్‌రావు, ఠాక్రే విపిన్, బొక్రె శంకర్ పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ అన్నారు. చిరు ధాన్యాలతో ఉపయోగాలు, వాటి ప్రాధాన్యత అనే అంశంపై శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఇచ్చోడ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి జి.కిరణ్ ప్రథమ స్థానంలో నిలువగా, పట్టణంలోని కాన్వెంట్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్.సుధామాధురి ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, ఎంఈవో శ్రీనివాస్, ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్, సత్యనారాయణ, రాఘవేందర్, వాసుకి, సుమలత, నితిన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఉట్నూర్ పర్యటనలో భాగంగా ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా మండలంలోని దుర్గాపూర్‌లో పల్లె పల్లెకు రేఖక్క కార్యక్రమంలో పర్యటించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు న్యాయం జరిగిందన్నారు.

క్లుప్తంగా

పోడుభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

బజార్‌హత్నూర్: మండలంలోని డేడ్ర, గిరిజాయి, మాన్కపూర్, ఉమార్డ గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులకు పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ కోరారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలో అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత 50 ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటున్నామని, అయినా.. అధికారులు హక్కు పత్రాలు ఇవ్వడం లేదన్నారు.

హిందీ భాషా ప్రాముఖ్యత తెలుసుకోవాలి

ఆదిలాబాద్: హిందీ భాషా ప్రాముఖ్యత ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ హిందీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీల్లో నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి సంతోష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, రేఖ, నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

నేరడిగొండ: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఏఎన్ఎం శ్యామల అన్నారు. శనివారం మండలంలోని వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాజీచౌక్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఓబీసీ మోర్చా, స్వర్ణకార సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. బీసీ కుల వృత్తులకు రుణాలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు తహర్ రమేశ్, ఇచ్చోడ బీజేపీ మండల అధ్యక్షులు నారాయణ, జాదవ్ రాము, కదం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావంతోనే ఐక్యత

ఆదిలాబాద్: ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావంతోనే ఆర్టీసీ యూనియన్లలో ఐక్యత వచ్చిందని రాష్ట్ర కార్యదర్శి భీంరావ్ అన్నారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట శనివారం నిర్వహించారు. యూనియన్ జెండా ఆవిష్కరించారు. నాయకులు అశోక్, ఆశన్న, కిరణ్, రమేశ్, వెంకటేశ్, దత్తు, సురేశ్, రహీం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్: సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వస్తే అధికారికంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొంరరి రమేశ్, మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, బొడ్డు కిరణ్, లింగాగౌడ్, రాంచందర్, సతీశ్, రవి, శ్రీకాంత్, భుజంగ్‌రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఆర్పీల సమ్మె

నార్నూర్: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఆర్పీలు సమ్మె బాట పట్టడంతో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం మూతపడింది. సిబ్బంది లేక 19రోజులుగా తెరుచుకోలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయింది. నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలో మొత్తం 7గురు సీఆర్పీలు పని చేస్తున్నారు. సంఘం నాయకుడు జాదవ్ కైలాస్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ డిమాండ్ చేశారు. ఈనెల 21న చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఆవిష్కరించారు. బీజేపీ అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా.. నేటికీ ఎస్సీల ఏబీసీడీల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్, కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, కత్తి గంగాధర్, సాంబశివరావు, తార రవికుమార్, ముక్కెర అశోక్, దర్శనాల గంగన్న పాల్గొన్నారు.

సంక్షిప్తం..

63వ రోజుకు డివిజన్ దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని చేస్తున్న దీక్షలు శనివారానికి 63వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో లారీ అసోసియేషన్ సభ్యులు కూర్చున్నారు. బోథ్‌ను డివిజన్‌గా చేసేంతవరకు ఉద్యమాన్ని ఆపబోమని వారు పేర్కొన్నారు.

నిధులు కేటాయించండి

బోథ్: మండలంలోని టివిటిపల్లె గ్రామం నుంచి పరుపుల పల్లె గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం రూ. 10 లక్షల నిధులు కేటాయించాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి శనివారం వినతిపత్రం అందజేశారు.

కోర్టు భవన నిర్మాణ పనులు చేపడుతాం

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కమిటీ సభ్యులు అబ్దుల్ రహీమ్, రాజీవ్‌లు అన్నారు. శనివారం బిల్డింగ్ స్థలాన్ని జడ్జి హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వామన్‌రావు దేశ్‌పాండే, పంద్రం శంకర్, సుభాష్, మోహన్ రావు పాల్గొన్నారు.

కార్మికుల బిల్లులు చెల్లించండి

బోథ్: మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలని మండల మధ్యాహ్న భోజనం కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, తహసీల్దార్ సుభాష్ చంద్రకు వినతిపత్రం అందజేశారు.

కుక్కర్ల పంపిణీ

కైలాస్‌నగర్: కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని పంజేషా, శాంతినగర్ కాలనీల్లో పలువురు మహిళలకు కుక్కర్లు పంపిణీ చేశారు. కేఆర్‌కే కాలనీవాసులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌రూరల్: ఎవరెస్టు శిఖరం అధిరోహించేందుకు శిక్షణకు వెళ్తున్న వంజరి కులానికి చెందిన కెరమెరి మండలం కేళి (కె) గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్‌కు వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే శనివారం హైదరాబాద్‌లో రూ. 20వేల ఆర్థిక సాయం చేశారు.

రోడ్డు మంజూరుపై హర్షం

నార్నూర్: గాదిగూడ మండలంలోని అందుగూడ గ్రామానికి రూ. 1.20 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే ఆత్రం సక్కును సర్పంచ్‌లతో పాటు జంగుబాయి ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకు ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. పూసం బాదిరావు, ఆర్జుని సర్పంచ్ మాడవి కన్ను, ఆడ రాహుల్, జాబాదే మనోహర్, డిగాంబర్ పాల్గొన్నారు.

భూమిపూజ

తలమడుగు: మండలంలోని ఉండం, డోర్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, ఆనంద్, నాయకులు కిరణ్, వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, ప్రకాష్ పాల్గొన్నారు.

వీరుల ఆశయ సాధనకు కృషి

ఎదులాపురం: తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన వీరుల ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి చంద్రమౌళి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించారు. నాయకులు గాలిపల్లి వెంకటస్వామి, రాజన్న, వసంత్ , రహమతుల్లా, మనోజ్, శోభ పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆదిలాబాద్: నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలో నిమజ్జన ఉత్సవాలు జరిగే రూట్ మ్యాప్‌ను డీఎస్పీ ఉమేందర్, మున్సిపల్ కమిషనర్ శైలజలతో కలిసి శనివారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. హిందూ సమాజ్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు హనుమండ్లు, కౌన్సిలర్ బండారి సతీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నార్నూర్: వినాయక చవితి పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై మహేశ్ సూచించారు. శనివారం గాదిగూడ మండల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా విద్యుత్‌శాఖ, గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలన్నారు. మైక్ అనుమతి కోసం మీసేవలో డీడీ చెల్లించి అనుమతి పొందాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసులకు దృష్టికి తీసుకురావాలన్నారు.